

ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.5
కనిష్ఠం 24.4
ANDHRAJYOTHY
నల్లగొండ
5
ఆదివారం 4 ఆగస్టు 2024



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	565.00 (244.1480)	5,24,288	39,741
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.00 (3.70)	138.77	514.80
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	119.58 (3.68)	24,952	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.103 | డ్రెస్ : రూ.150 | స్కిన్‌లెస్ : రూ.170



భూ సమస్యల పరిష్కారం దిశగా

ఏళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యల పరిష్కారంలో 'ధరణి' వైఫల్యాలను అధిగమించే లక్ష్యంతో ప్రభుత్వం క్షేత్రస్థాయి అధ్యయనానికి శ్రీకారం చుట్టింది. నూతన ఆర్‌వోఆర్-2024 చట్టాన్ని తీసుకొచ్చే క్రమంలో అన్ని రకాల భూసమస్యల పరిష్కారానికి నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని తిరుమలగిరి(సాగర్) మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది.

- తిరుమలగిరి(సాగర్)

▸ రాష్ట్ర స్థాయిలో పైలట్ ప్రాజెక్టుగా తిరుమలగిరి(సాగర్) మండలం ఎంపిక

▸ గ్రామాల్లో పర్యటించనున్న రెవెన్యూ బృందాలు

నూతన ఆర్‌వోఆర్ చట్టాన్ని రూపొందించే క్రమంలో తిరుమలగిరి(సాగర్) మండలంలో అధ్యయనానికి రెవెన్యూ బృందాన్ని ఏర్పాటుచేశారు. శనివారం కలెక్టరేట్‌లో ఆరుగురు తహసీల్దార్లతో కూడిన ఉన్నత స్థాయి రెవెన్యూ బృందానికి కలెక్టర్ నేతృత్వంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిసింది. రానున్న 15 రోజులు ఈ రెవెన్యూ బృందాలు మండలంలోని పలు గ్రామాల్లో సదస్సులు నిర్వహించి పరిష్కారానికి నోచుకోకుండా, భూసమస్యలతో సతమతమవుతున్న రైతుల నుంచి నిర్ణీత ఫార్మెట్‌లో దరఖాస్తులు తీసుకోనున్నారు. అనంతరం ప్రతీ దరఖాస్తుదారు నుంచి సేకరించిన ఆధారాలు, రికార్డులను రెవెన్యూ రికార్డులతో సరిపోల్చి ప్రతీ రైతు సమస్యకు పరిష్కారం చూపించనున్నారు.

దశాబ్దాల వివాదాలు పరిష్కారమయ్యే దిశగా

మండలంలో ప్రధానంగా కృష్ణపట్టె ప్రాంతంలో ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉన్నాయి. చింతలపాలెం, నెల్లికల్లు, జమ్మనకోట, తిమ్మాయిపాలెం, తునికినూతలలో అత్యధికంగా సుమారు 6,816 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గతంలో ఈ భూములు ఉన్న సర్వే నెంబర్లు 22, 158, 162, 222, 223, 108, 172, 344, 407 తదితర సర్వే నెంబర్లలో వాస్తవ భూ రికార్డుల (ఆర్ఎస్ఆర్) కంటే అత్యధికంగా పాస్ పుస్తకాలు జారీ అయ్యాయి. రెవెన్యూ రికార్డు ప్రక్షాళన సమయంలో ఈ భూములన్నింటినీ అప్పటి ప్రభుత్వం పార్ట్-బీలో చేర్చింది. తదనంతరం పలుమార్లు ఈ భూముల్లో కాస్తు, కబ్జాలో ఉన్న రైతులను గుర్తించి కొందరికి పాస్‌పుస్తకాలు జారీ చేసింది. కాగా, నేటికీ పాస్‌పుస్తకాలు పొందలేకపోయిన రైతులు వందల సంఖ్యలో ఉన్నారు. వీరంతా నిత్యం వారి సమస్యల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

● చింతలపాలెం, నాయకునితండా, తిమ్మాయిపాలెం, బట్టువెంకన్నబావితండా గ్రామాల్లో కాందిశీకుల భూములు ఉన్నాయి. దేశ విభజన సమయంలో ఇక్కడి నుంచి తరలిపోయిన కాందిశీకుల భూములు కావడంతో వీటిపై సుమారు 70 ఏళ్లుగా కబ్జాలో ఉండి సేద్యం చేస్తున్న రైతులు నేటికీ హక్కులు పొందలేకపోయారు. సర్వే నెంబర్లు 28, 52, 60, 204, 24, 38లో సుమారు 2,500 ఎకరాల కాందిశీకుల భూముల వివాదం పరిష్కారానికి సంబంధిత రైతులు ఏళ్లుగా రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు.

● సాగర్ ముంపు గ్రామాలైనా సుంకిశాలతండాలో సర్వే నెంబర్ 67లో 1958లో 550 ఎకరాలకు అటవీ భూములకు పాస్‌పుస్తకాలు ఇచ్చినా, నేటికీ సంబంధిత గిరిజన రైతుల వివరాలు 1బీలో లేకపోవడంతో బ్యాంక్‌ల ద్వారా వ్యవసాయ రుణాలు, ఇతర ప్రభుత్వ పథకాలకు అర్హులు కాలేకపోతున్నారు. అదే సర్వే నెంబర్‌లో మిగిలిన భూములకు పాస్‌పుస్తకాలను నేటికీ కొందరు రైతులకు మంజూరుకాలేదు.

● నాగార్జునపేటతండాలో సర్వే నెం 12, 32లో రెవెన్యూ, ఫారెస్ట్ సరిహద్దు ఉండడంతో తండాలో ఆ భూములను పార్ట్-బీలో ఉంచడంతో తండాలోని గిరిజనులెవ్వరికీ పాస్ పుస్తకాలు రాలేదు. ఎర్రచెరువుతండాలో 1955 నుంచి 1993 వరకు సర్వే నెం.424లో ఉన్న భూమి ప్రభుత్వ భూమిగా రికార్డయింది. అయితే ఆ భూమిలో ఫారెస్ట్ అధికారులు మొక్కలను నాటడంతో వివాదం నెలకొంది. దీంతో ఫారెస్ట్, స్థానిక గిరిజన రైతుల మధ్య వివాదం కొనసాగుతోంది. అదేవిధంగా మండల కేంద్రంలో పలు ప్రభుత్వ భూముల్లో వెంచర్లు ఏర్పాటు కావడం, పలు గ్రామాల్లో ప్రభుత్వ, చెరువు శిఖం భూములు, దేవాదాయ భూములు ఆక్రమణలకు గురయ్యాయి. వీటిపై అధికారులు చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

● మండలంలోని పలువురు రైతుల సర్వే నెంబర్లు, భూ విస్తీర్ణంలో తేడాలు, కాస్తు కబ్జాలో ఒక సర్వే నెంబర్‌లో ఉంటూ వాస్తవ భూమి వేరే సర్వే నెంబర్‌లో ఉండడం, సేద్యం చేస్తున్న అర్హులైన రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు రాకపోగా, కాస్తులో లేని వారికి పాస్‌పుస్తకాల జారీ, పెండింగ్ మ్యుటేషన్, ఇనామ్ భూములకు ఓఆర్‌సీ, భూముల వారసత్వం విషయంలో పలు వివాదాలు నేటికీ కొనసాగుతున్నాయి. వీటన్నింటికి ఈ పైలట్ ప్రాజెక్టులో పరిష్కారం లభించే అవకాశం ఉంది.

అర్హులైన రైతులకు పాస్‌పుస్తకాలు వచ్చేలా చూస్తాం



తిరుమలగిరి(సాగర్) మండలంలోని అర్హులైన రైతులందరికీ పాస్‌పుస్తకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. మండలంలోని ఆయా గ్రామాల్లో ఐదుగురు తహసీల్దార్ల నేతృత్వంలోని రెవెన్యూ బృందాలు పర్యటిస్తాయి. సమస్యలుఎదుర్కొంటున్న రైతులు, వారి దగ్గర ఉన్న ఆధారాలతో అధికారులను సంప్రదించాలి. అవసరమైతే వెంటనే సర్వే చేసి అర్హులైన రైతులను నిర్ధారిస్తాం. ఈ ప్రాజెక్టు ఫలితాల ద్వారా రాష్ట్రమంతా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

- సి.నారాయణరెడ్డి, నల్లగొండ జిల్లా కలెక్టర్

పాస్‌పుస్తకాలు రాక ఇబ్బందులకు గురవుతున్నాం



సాగర్ ముంపు గ్రామం కావడంతో మాకు నాగార్జునపేట తండాలో భూములను ఇచ్చారు. ఏళ్ల క్రితం రెవెన్యూ అధికారులు వివాదం ఉందని, మా తండాలో ఎవ్వరికీ పాస్‌పుస్తకాలు ఇవ్వలేదు. దీంతో వ్యవసాయానికి బ్యాంకుల నుంచి రుణాలు, రైతుబంధు, రైతుబీమా ఏదీ కూడా మా తండా వాసులకు అందడం లేదు. అధికారులు వెంటనే మాకు పాస్ పుస్తకాలు వచ్చేలా చూడాలి.

- రమావత్ కనికి, నాగార్జునపేటతండా

పలు రకాల భూసమస్యల వల్లే

తిరుమలగిరి(సాగర్) మండలంలో వివిధ రకాల భూ సమస్యలు ఉండడం వల్లే రాష్ట్ర స్థాయిలో పైలట్ ప్రాజెక్టుగా మండలాన్ని ఎంపిక చేసినట్టు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధరణి సమస్యల పరిష్కార కమిటీ సభ్యుడు, లీఫ్ ఫౌండర్ భూమి సునీల్, కోదండరెడ్డి, రాష్ట్ర స్థాయి రెవెన్యూ అధికారులు, ఇతర రెవెన్యూ నిపుణుల బృందం ఇటీవల ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో భూసమస్యలు, వాటి కారణాలు, పరిష్కార మార్గాల గురించి చర్చించారు. ఈ క్రమంలోనే మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి సూచన మేరకు నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని తిరుమలగిరి(సాగర్) మండలాన్ని ఎంపిక చేశారు. మండలంలో ప్రభుత్వ, పట్టా, కాందిశీకుల, దేవాలయ, వక్ఫ్, ఇనామ్, అటవీ, ఆబాదీ, పోరంబోకు భూములతోపాటు నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైన గ్రామాలకు పునరావాసం కల్పించబడిన భూములు, ఫారెస్ట్, రెవెన్యూ సరిహద్దు కలిగి ఉన్న భూముల వంటి విభిన్న భూ సమస్యలు మండలంలో ఉన్నాయి.

రాష్ట్రమంతా అమలు చేసే ఉద్దేశంతో

రెవెన్యూ ఉన్నత స్థాయి బృందాలు మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి సమస్యలను ఎదుర్కొంటున్న రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించడంతోపాటు ప్రతీ రైతు సమస్యకు కారణాన్ని గుర్తించి, వాటిని పరిష్కారించేలా చర్యలు తీసుకుంటారు. నిర్ణీతకాలంలో అన్ని భూ సమస్యలను పరిష్కరించి ఇక్కడ వచ్చిన ఫలితాల ద్వారా ఇదే నమూనాను రాష్ట్రమంతా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఉద్దేశంతోనే పైలట్ ప్రాజెక్టును ప్రారంభించారు.

రేపు సాగర్ క్రస్ట్‌గేట్ల ఎత్తివేత

▸ సాగర్‌కు పెరిగిన వరద ▸ ఎగువ నుంచి 5,24,228 క్యూసెక్కుల రాక



నాగార్జునసాగర్, ఆగస్టు 3: నాగార్జునసాగర్‌కు ఎగువ నుంచి వరద పోటెత్తడంతో సోమవారం క్రస్ట్‌గేట్లను ఎత్తే అవకాశం ఉంది. రోజుకు 15 అడుగుల చొప్పున ప్రాజెక్టులో నీటిమట్టం పెరుగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 565 అడుగులకు చేరుకుంది. ఎగువ నుంచి వరద రాకను బట్టి 585 అడుగులకు సాగర్ నీటిమట్టం చేరుకోగానే క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తామని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. సాగర్ నీటిమట్టం 585 అడుగులకు చేరుకోవాలంటే రెండురోజులు పడుతుంది. సోమవారం ఉదయం లేదా సాయంత్రం క్రస్ట్‌గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

పెరిగిన వరద

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద పోటెత్తింది. వారం రోజులుగా వరద వస్తుండగా, శనివారం ఉదయం నుంచి మరింత పెరిగింది. శుక్రవారం 4,89,361 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, శనివారం నాటికి 5,24,228 క్యూసెక్కులకు చేరింది. దీంతో ఒక్క రోజులో సాగర్ నీటిమట్టం 15 అడుగుల మేర పెరిగింది. శుక్రవారం సాయంత్రం 6గంటలకు 550అడుగులుగా(211.1018 టీఎంసీలు)ఉన్న సాగర్ నీటిమట్టం, శనివారం సాయంత్రం 6గంటలకు 565 అడుగులకు (244.1480టీఎంసీలు) చేరింది. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 4,33,088 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా, సాగర్‌కు 5,24,228 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు (312.5050టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 565 అడుగులుగా (244.1480 టీఎంసీలు) ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 6,660 క్యూసెక్కులు,ఎడమ కాల్వ ద్వారా 3,374 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 27, 507క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 400 క్యూ సెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 39,741 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా,ఎగువ నుంచి 5,24,288 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

సాగర్ కాల్వలకు నీళ్లు వదిలి నేటికి 57 ఏళ్లు

నాగార్జునసాగర్‌కు 1955 డిసెంబరు 10వ తేదీన నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ శంకుస్థాపన చేయగా, నిర్మాణం పూర్తవ్వకుండానే 1967 ఆగస్టు 4న నాటి ప్రధాని ఇందిరాగాంధీ కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేశారు. నీటిని విడుదల చేసిన అనంతరం ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. కాల్వకు నీటి విడుదల చేసి నేటికి 57 ఏళ్లు పూర్తయ్యాయి. ప్రాజెక్టు కుడి వైపు కాల్వకు జవహర్‌లాల్‌నెహ్రూ పేరును, ఎడమ కాల్వకు లాల్‌బహదూర్‌శాస్త్రీ పేరును పెట్టారు. కుడి కాల్వ హెడ్ రెగ్యులేటరీకి తొమ్మిది తూములు, ఎడమ కాల్వ హెడ్ రెగ్యులేటరీకి మూడు తూములు ఏర్పాటు చేశారు.

కొనసాగుతున్న నీటి విడుదల

పెద్దఅడిశర్లపల్లి: నల్లగొండ జిల్లా కేంద్రం తాగు, సాగు నీటి అవసరాలు తీర్చేందుకు ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ ద్వారా ఉదయసముద్రానికి నీటివిడుదల కొనసాగుతోంది. గత నెల 22న తాగునీటి అవసరాల కోసం 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసిన అధికారులు, సాగర్ నీటిమట్టం పెరగడంతో శనివారం మరో 500 క్యూసెక్కులు పెంచి 1,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సాగర్ వెనుక జలాల నుంచి ఏఎమ్మార్పీకి మూడు మోటార్ల ద్వారా 1,800క్యూసెక్కుల నీటిని ఏకేబీఆర్‌కు నీటిని పంపింగ్ చేస్తున్నారు. అక్కడి నుంచి జంటనగరాలకు 525 క్యూసెక్కులు, మిషన్‌భగీరథకు 45 క్యూసెక్కులు, డీ-7కు 100క్యూసెక్కులు, డీ-8, 9కు 150క్యూసెక్కులు విడుదలచేస్తున్నారు.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. దీంతో 645అడుగుల (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం శనివారం సాయంత్రానికి 642 అడుగులకు(3.70టీఎంసీలు) చేరుకుంది. ఎగువనుంచి 138.77క్యూసెక్కుల వరద వస్తుండగా, మూసీ ఆయకట్టులో వానాకాలం పంటల సాగు కోసం ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు 514.80క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

రైతులెవ్వరూ నీటిని మళ్లించుకోవద్దు

కలెక్టర్ సి.నారాయణరెడ్డి



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నల్లగొండ టౌన్, ఆగస్టు 3: నాగార్జునసాగర్ నీటితో జిల్లాలోని అన్ని చెరువులు నింపనున్న దృష్ట్యా రైతులెవ్వరూ నీటిని సాగుకు మళ్లించుకోవద్దని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. నాగార్జునసాగర్ నీటి వినియోగంపై రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, మండలస్థాయి అధికారులతో శనివారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సాగర్ ఎడమ కాల్వకు మంత్రులు శుక్రవారం సాగునీటిని విడుదల చేసిన చేశారని, శనివారం నుంచే జిల్లాలోని అన్ని చెరువులను ఈ నీటితో నింపనున్నట్టు తెలిపారు. ఎడమకాల్వ ద్వారా 10వేల నుంచి 11 వేల క్యూసెక్కుల నీటి వస్తున్నందున ఎక్కడైనా చెరువులు, కుంటలు తెగే, గండ్లుపడే ఆస్కారం ఉంటే ముందే గుర్తించి తక్షణమే వాటిని అరికట్టాలన్నారు. రైతులెవ్వరూ సాగునీటిని తొందరపడి మళ్లించుకోవద్దని, వారం రోజుల్లో అన్ని చెరువులను నింపుతామన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు వారి పరిధిలోని చెరువులన్నింటినీ ఒకటికి రెండుసార్లు తిరిగి పరిశీలించాలన్నారు. నిర్దేశించిన ఆయకట్టు వరకు సాగునీరు వెళ్లాల్సిన అవసరం ఉందని, ఈ విషయంలో స్థానిక ఇంజనీరింగ్ అధికారులు, అలాగే మండల బృందాలు పూర్తి అప్రమత్తంగా ఉండాలన్నారు. లస్కర్లందరూ కాల్వపై అప్రమత్తంగా పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో ఏ ఒక్క చెరువు తెగిపోవడానికి వీలులేదని, ఎంపీడీవో, తహసీల్దార్, స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్లు సాగర్ నీటిని ప్రజలు సక్రమంగా వినియోగించుకోవడంలో ముఖ్యపాత్ర వహించాలని, అదేవిధంగా ఆర్డీవోలు, డీఎస్పీలు సైతం ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శుల ద్వారా ఎప్పటికప్పుడు సాగునీటిని పర్యవేక్షణ చేయాలన్నారు. ఏడాది తరువాత సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేసినందున రైతులు పంటలు పండించుకునే అవకాశం ఏర్పడిందని, సాగునీటిని సక్రమంగా వినియోగించుకోవడంలో రైతులతోపాటు, ఇంజనీరింగ్, రెవెన్యూ, పోలీస్, అన్ని శాఖల అధికారులు సహకరించాలన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ, నాగార్జునసాగర్ నీటి నిర్వహణకు పోలీస్‌శాఖ తరఫున అవసరమైన పూర్తి సహకారం అందిస్తామన్నారు. అంతేగాక బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మండల స్థాయిలో ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందేలా సహకరించాలన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎడమ కాల్వ నుంచి సాగునీటి విడుదలను ప్రతీ రోజు పెంచుకుంటూ పోతామని తెలిపారు. టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, ఆర్డీవోలు, సాగర్ ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో అన్ని రకాల ఎరువులు

జేడీఏ శ్రవణ్ కుమార్

నల్లగొండ టౌన్, ఆగస్టు 3: నాగార్జునసాగర్ ఎడమ కాల్వ నుంచి నీటి విడుదల చేయడం, జిల్లాలోని చెరువులు నింపనుండడంతో ఆయకట్టు పెరగనున్న నేపథ్యంలో జిల్లాకు అవసరమైన అన్ని రకాల ఎరువులను అందుబాటులో ఉంచామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్‌కుమార్ తెలిపారు. శనివారం 80.981మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులోకి రాగా, అందులో 41,881మెట్రిక్ టన్నుల యురియా ఉందన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఎరువుల లభ్యతపై క్యాంపు కార్యాలయంలో సమీక్షించి రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావుతో మాట్లాడి జిల్లాకు అదనంగా రెండు ర్యాక్‌ల యురియాను సరఫరా చేయించారన్నారు. ప్రతీ నెల జిల్లాకు కేటాయించిన ఎరువులపై సమీక్షించి, అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచుతామని తెలిపారు.

దివ్యాంగురాలి దారుణహత్య
•7లో..
తల్లిదండ్రులు మందలించారని ఇద్దరి ఆత్మహత్య
•7లో..
సాగర్‌కు ప్రారంభమైన పర్యాటకుల రాక
•7లో..

విద్యలో తెలంగాణ రోల్‌మోడల్

▸ ఉద్యోగాల కల్పనకే జాబ్‌క్యాలెండర్ విడుదల ▸ రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



మహిళా డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్, ఆగస్టు 3: రాజకీయాలకతీతంగా ప్రభుత్వ విద్యను ప్రోత్సహించి తెలంగాణను దేశంలోనే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్యే నిధులు రూ.కోటితో నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని లక్ష్యసాధన కృషి చేయాలన్నారు. జిల్లాలో రూ.20లక్షలతో నైపుణ్యాల అభివృద్ధి కేంద్రాన్ని నిర్మిస్తున్నామని, భవిష్యత్‌లో ఈ కేంద్రాన్ని హైదరాబాదులో నిర్మించనున్న స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీకి అనుసంధానం చేస్తామన్నారు. ఇటీవల ఐటీరంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కోటి రూపాయలతో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టడమే కాకుండా, అవసరమైన అన్ని వసతులను కల్పిస్తామని, ఒకవేళ అధ్యాపకులు లేకుంటే అధ్యాపకులను నియమించుకున్నట్లయితే ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా జీతాలు చెల్లిస్తామన్నారు. కళాశాలలో ఆర్వో వాటర్ ప్లాంట్ కావాలని విద్యార్థినులు కోరగా, 2000 మంది విద్యార్థులకు సరిపోయే విధంగా కెంట్ వాటర్ ప్లాంట్‌ను వెంటనే ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతీ ఒక్కరికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగా ప్రభుత్వం ఇటీవల జాబ్ క్యాలెండర్‌ను సైతం విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కే.శ్రీనివాసరాజు, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రమేష్, పంచాయతీరాజ్ డీఈ గిరిధర్, ఆర్డీవో రవి, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మురుగు కాల్వలను శుభ్రం చేయాలి

వర్షాకాలం దృష్ట్యా ఎప్పటికప్పుడు మురుగు కాల్వలను శుభ్రం చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం ఆయన మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ సాధారణ నిధులు రూ.కోటితో నిర్మించనున్న మునిసిపల్ కౌన్సిల్ హాల్, రికార్డు రూమ్, రెస్ట్ రూమ్‌లకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. మురుగు కాల్వల అపరిశుభ్రత కారణంగా ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణ చంద్ర, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కౌన్సిలర్లు, మునిసిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సొరంగం పనులు రెండేళ్లలో పూర్తి చేయిస్తా

కనగల్: జిల్లా సాగు, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారమైన శ్రీశైలం సొరంగం పనులను పూర్తి చేయించటమే తన లక్ష్యమని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఏఎమ్మార్పీ ప్రధానకాల్వ డీ-29 గేటు ఎత్తి శనివారం దిగువకు నీటిని విడుదల చేశారు. అనంతరం రేగట్టె గ్రామంలో రూ.3కోట్లతో నిర్మిస్తున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. కేసీఆర్ అవినీతిని ప్రజలు గమనించి చిత్తుగా ఓడించి ఫాంహౌస్‌కు పరిమితం చేశారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో రవికుమార్, తహసీల్దార్ పద్మ, విద్యుత్ ఏఈ రాజశేఖరచారి, ఆర్ఐ యాదగిరి, మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

నాలుగున్నర లక్షల ఎకరాలకు సాగు నీరు

నల్లగొండ రూరల్: 30 నెలల్లో ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు పూర్తిచేసి, నాలుగున్నర లక్షల ఎకరాలకు సాగు నీరందిస్తామని మంత్రి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లాలోని నల్లగొండ మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని డీ-37 ద్వారా నీటి శనివారం విడుదల చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ వంగురి లక్ష్మయ్య, ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, గుమ్మల మోహన్‌రెడ్డి, జులకంటి సైదిరెడ్డి, మాజి సర్పంచ్‌లు పాల్గొన్నారు.

డ్రగ్స్, మాదక ద్రవ్యాలను సమూలంగా నిర్మూలించాలి

నల్లగొండ క్రైం: సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన మొదటి మీటింగ్‌లోనే రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనే ధ్యేయంగా ఆదేశాలు జారీచేశారని, జిల్లాలో కూడా డ్రగ్స్, మాదక ద్రవ్యాల నివారణకు పోలీస్ శాఖ కృషి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశించారు. నల్లగొండలో ఎన్‌సీఏపీ నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో కుటుంబం, పిల్లలను గుర్తు చేసుకొని నడపాలని, కొన్ని చిన్న పొరపాట్లే కుటుంబాలను వీధిన పడేసే ప్రమాదం ఉంటుందన్నారు. పట్టణంలో రోడ్డు ప్రమాదాల నివారణతోపాటు పట్టణాన్ని పొల్యూషన్ ఫ్రీగా మార్చాలనే సంకల్పంతో రూ.550కోట్లతో పట్టణం చుట్టూ అవుటర్ రింగ్ రోడ్డును నిర్మించనున్నామని, అందుకు సంబంధించి ఈ నెల చివరి వరకూ టెండర్లు పూర్తి చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ మారణహోమాన్ని అరికట్టాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి



నల్లగొండలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నల్లగొండ రూరల్, ఆగస్టు 3: పాలస్తీనపై ఇజ్రాయిల్ మారణహోమాన్ని ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి కోరారు. సీపీఎం కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని సుభాష్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గడచిన పది నెలల్లో సామ్రాజ్యవాద అమెరికా దన్నుతో ఇజ్రాయిల్ సాగించిన దారుణ నరమేధం సాగిస్తోందన్నారు. 40వేల మందికి పైగా పాలస్తీనులు మృత్యువాతపడ్డారని అందులో 15 వేలమంది చిన్నారులే ఉన్నారన్నారు. 90వేల మందికి పైగా క్షతగాత్రులు అయ్యారని, ఇజ్రాయిల్ బాంబుల ధాటికి గాజా ప్రాంతం 60శాతం నాశనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల మంది నిరాశ్రయులు అయ్యారని, ఓ వైపు శాంతి జపం చేస్తూనే ఇజ్రాయిల్‌కు ఆయుధ సాయం చేస్తున్న అమెరికా అధ్యక్షుడు జోబైడెన్‌పై స్వదేశంలోనే నిరసనలు వెల్లువెత్తాయన్నారు. యుద్ధం ఇలాగే సాగితే మూడో ప్రపంచ యుద్ధం వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. దీనిపై మేధావులు, అభ్యుదయ సంఘాలు, సంస్థలు స్పందించాలని అన్నారు. నిరసన కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు నారి ఐలయ్య, బండా శ్రీశైలం, పాలడుగు నాగార్జున, ప్రభావతి, సయ్యద్ హాశం, ఎండి.సలీం, పి.నర్సిరెడ్డి, దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, మల్ల మహేష్, కొండ అనురాధ, దండెంపల్లి సరోజ, గాదె నర్సింహ, ఎంకన్న, అద్దంకి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య లేకుండా చర్యలు

ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రమోహన్



సమావేశంలో పాల్గొన్న ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రమోహన్, ఏడీఈ సత్యనారాయణ

చిట్యాలరూరల్, ఆగస్టు 3: రైస్‌మిల్లులకు విద్యుత్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రమోహన్ అన్నారు. మండలంలోని రైస్‌మిల్లర్లు లోవోల్టేజీ సమస్యలతో సతమతమవుతుండగా, మిల్లర్లు ఎస్ఈ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ట్రాన్స్‌కో ఏడీఈ సత్యనారాయణతో కలిసి చిట్యాల మండలం వట్టిమర్తిలో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులతో ఎస్ఈ శనివారం సమావేశమయ్యారు. మిల్లర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిట్యాలతో పాటుగా మండలంలోని రైస్‌మిల్లులకు ఒక్క విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే తిరిగి మిల్లు ప్రారంభమయ్యేందుకు చాలా సమయం పడుతోందని మిల్లర్లు వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ, విద్యుత్ సరఫరాలో సమస్య పరిష్కారానికి కొంత సమయం పడుతుందని, లోవోల్టేజీ సమస్యను పరిష్కారిస్తామన్నారు. పెద్దకాపర్తి నుంచి ప్రత్యేకంగా విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేస్తామన్నారు. అంతేగాక ప్రత్యేక లైన్‌కు ప్రతిపాదనలు పంపుతామన్నారు. సమావేశంలో మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు, మండల అధ్యక్షుడు తేరటుపల్లి హనుమంతు, మండల ప్రధానకార్యదర్శి పోలా పెద్దయ్య, సభ్యులు పందిరి శ్రీనివాస్, వనపర్తి వెంకటేశ్వర్లు, వేలుపల్లి శంకరయ్య, వనపర్తి వీరేశం, వేలుపల్లి వెంకటేశ్వర్లు, ఏఈ వి.రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో కార్డెన్‌సెర్చ్

తిరుమలగిరి, ఆగస్టు 3: సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మునిసిపల్ కేంద్రంలోని క్రాస్‌రోడ్ పరిసరాల్లో నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వాహనాలను తనిఖీ చేసి, లైసెన్స్, అనుమతిలేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రతీ వాహనదారుడు తమ వెంట, లైసెన్స్, బండి పత్రాలు ఉంచుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు పంపుతామన్నారు. తనిఖీల్లో ఎఐ సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

భువనగిరి అర్బన్, ఆగస్టు 3: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్యపూజలు జరిగాయి. స్వయంభువులను మేల్కొలిపిన అర్చకస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణప్రతిష్ఠామూర్తులను పంచామృతాలతో అభిషేకించి తులసిదళాలతో అర్చించారు. ఆలయంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం వైభవంగా చేపట్టారు. అదేవిధంగా స్వామి అమ్మవార్లను ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి నిత్యతిరుకల్యాణోత్సవం చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టారు. అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్యకైంకర్యాలు వైభవంగా నిర్వహించారు. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరస్వామికి నిత్యారాధనలు, నిత్యరుద్రహవన పూజలు కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.15,41,695 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, సంగీత కార్యక్రమంలో భాగంగా మధువంతి మధురస్వర కళాపీఠం ఆధ్వర్యంలో భక్తి సంగీతం, కూచిపూడి కళామృత నృత్య ప్రదర్శన నిర్వహించారు.



ఆలయంలో నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న పూజారులు

బీఆర్ఏఓయూలో
31వరకు అడ్మిషన్లకు గడువు

● టెలీ కాన్ఫరెన్స్‌లో బీఆర్ఏఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుధారాణి

● ఉన్నత విద్యకు మెరుగైన అవకాశాలు : బీఆర్ఏఓయూ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ధర్మానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ ధర్మానాయక్

నల్లగొండ క్రైం, జూలై 3 : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ(బీఆర్ఏఓయూ)లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేశామని, ఈ నెల 31వ తేదీ వరకూ ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లను పొందవచ్చని బీఆర్ఏఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుధారాణి తెలిపారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని బీఆర్ఏఓయూ రీజినల్ సెంటర్‌లో నిర్వహించిన స్టడీ సెంటర్ కోఆర్డినేటర్లు, జాక్టో, కౌన్సిలర్స్ సమావేశంలో యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ డా.ధర్మానాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ సుధారాణి సమావేశంలో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ అర్హులైన వారంతా అడ్మిషన్లు పొందేలా ప్రతి ఒక్కరూ కృషి చేసి ఈ ఏడాది అడ్మిషన్ల సంఖ్యను మరింతగా పెంచాలన్నారు. అనంతరం బీఆర్ఏఓయూ రిజిస్ట్రార్ డాక్టర్ ధర్మానాయక్ మాట్లాడుతూ బీఆర్ఏఓయూ ద్వారా ఉన్నత విద్యకు మెరుగైన అవకాశాలు ఉన్నాయని, మధ్యలో చదువు మానేసిన వారు ప్రతి ఒక్కరూ యూనివర్సిటీ కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దూర విద్యలో న్యాక్-ఏ గ్రేడ్ సాధించిన ఘనత బీఆర్ఏఓయూకే ఉందని, అందరి సమష్టి కృషితోనే గ్రేడు సాధించామన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ దూరవిద్యతోనే సకలం సిద్ధిస్తాయని భావించి ఓపెన్ యూనివర్సిటీలో యూజీ, పీజీ, డిప్లొమా సర్టిఫికెట్ కోర్సులను అందజేస్తుందన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు అడ్మిషన్లకు గడువు ఉందని, ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ప్రవేశం పొందాలని సూచించారు. రెగ్యులర్ విద్యకు ధీటుగా బీఆర్ఏఓయూ విద్యావకాశాలను కల్పిస్తోందన్నారు. సమావేశంలో కళాశాల కోఆర్డినేటర్ అంతటి శ్రీనివాసులు, అధ్యాపకులు పరంగి రవికుమార్, సిబ్బంది బద్ధం మహేష్, శ్రీకాంత్, రేఖ్యా నాయక్, రమేష్, శంకర్, సురేష్, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

అధికారుల తప్పిదం.. మహిళా రైతులకు శాపం

● ఒకే ఆధార్ నెంబర్ నమోదుతో మహిళా రైతులకు వర్తించని రుణమాఫీ


తెలంగాణ ప్రభుత్వం
పంటరుణమాఫీ 2024
రైతు సమాచార పత్రం

రైతు సమాచార పత్రంలో ఇద్దరు మహిళ రైతుల ఆధార్ నెంబర్ ఒకటే నమోదు చేయడంతో రిజెక్టు అయినట్లు తెలియజేసిన వ్యవసాయశాఖ

నల్లగొండ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వ్యవసాయశాఖ, బ్యాంకు అధికారుల తప్పిదం ఇద్దరు మహిళా రైతులకు శాపంగా మారింది. ఇద్దరికీ ఒకే నెంబర్ కలిగిన ఆధార్ నమోదు చేయడంతో ఇద్దరికీ రుణమాఫీ వర్తించకుండా పోయింది. వివరాల్లోకి వెళితే.. నల్లగొండ జిల్లాకేంద్రానికి చెందిన నన్నూరి కీర్తి రెడ్డికి, తిరుమలగిరిలోని యూనియన్ బ్యాంకులో 2023 డిసెంబరు 9 నాటికి రూ.89,531 పంట రుణం ఉంది. రుణమాఫీ నిబంధనల మేరకు కీర్తిరెడ్డి రుణమాఫీకి అర్హురాలు. అదేవిధంగా జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలానికి చెందిన బి.బీసమ్మకు అదే మండలం బొంకూరుకు చెందిన ఏపీజీవీబీలో 2023 డిసెంబరు 9 నాటికి రూ.1,29,479 రుణం ఉంది. నిబంధనల ప్రకారం ఈమె కూడా రుణమాఫీకి అర్హురాలే. మొదటి రెండు విడతల్లో వీరిద్దరి రుణాలు మాఫీ కాలేదు. తన రుణం ఎందుకు మాఫీ కాలేదో తెలుసుకునేందుకు నన్నూరి కీర్తిరెడ్డి వ్యవసాయశాఖ అధికారులను, బ్యాంకు అధికారులను సంప్రదించగా ఈమె ఆధార్ నెంబర్ స్థానంలో జోగులాంబ గద్వాల జిల్లా శ్రీనగర్‌కు చెందిన బీసమ్మ ఆధార్ నెంబర్ నమోదయిందని, అందువల్ల ఆధార్ నెంబర్ సక్రమంగా లేదనే కారణంతో ఇద్దరి రుణాలు మాఫీ జాబితాలో చేర్చలేదని తెలిపారు. కీర్తిరెడ్డి ఆధార్ నెంబర్ వేరే ఉండటంతో పాటు బ్యాంకు, జిల్లా అన్ని వేర్వేరు అయినా, ఈ తప్పిదం ఎలా జరిగిందనేది బాధిత మహిళా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రుణమాఫీ లబ్ధిదారుల జాబితా తయారు చేసిన వ్యవసాయశాఖ కమిషనరేట్ సిబ్బంది నిర్లక్ష్యంతో తమకు అన్యాయం జరిగిందని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని నల్లగొండకు చెందిన కీర్తిరెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా అధికారులను సంప్రదించగా తమకు దరఖాస్తు చేస్తే పరిశీలించి పొరపాటు సరిదిద్దడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పుతున్నారు. ఇలాంటి తప్పిదాలతో పెద్దసంఖ్యలో రైతులు రుణమాఫీ వర్తించకుండా నష్టపోయారని, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

దివ్యాంగురాలి దారుణహత్య


రమ (ఫైల్ ఫొటో)

సూర్యాపేటరూరల్, ఆగస్టు 3: గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో ఓ దివ్యాంగురాలు దారుణహత్యకు గురైంది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండల పరిధిలోని జాటోతుతండాలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన ధరావత్ లాక్యా, లూది దంపతులకు తొమ్మిది మంది సంతానం. ఆరుగురు కూతుర్లు, ముగ్గురు కుమారులు. అందరిలో చివరి సంతానం రమ(37) పుట్టుకతో దివ్యాంగురాలు (ఒక కాలుకు పోలియో). తల్లిదండ్రులు 30ఏళ్ల క్రితమే అనారోగ్యంతో చనిపోయారు. రమకు వివాహం కాలేదు. ముగ్గురు సోదరులు ఉన్నా తండాలో ఆమె పదేళ్ల నుంచి ఒంటరిగా ఉంటూ ప్రభుత్వ పింఛన్‌తో జీవనం సాగిస్తోంది. శుక్రవారం రాత్రి ఇరుగుపొరుగు వాళ్లతో మాట్లాడిన రమ ఇంట్లోకి వెళ్లి నిద్రించింది. ఇంట్లో ఒంటరిగా ఉన్నది చూసిన దుండగులు అర్ధరాత్రి మరణాయుధాలతో తలపై మోది దారుణంగా హత్య చేశారు. శనివారం ఉదయం ఆమె రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉండడాన్ని చూసిన తండావాసులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సూర్యాపేట డీఎస్పీ రవి, రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ బాలునాయక్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వెంటనే క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. కేసుతను అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. రమ మెడలో వెండి గొలుసు అలాగే ఉంది. లైంగికదాడికి పాల్పడి హత్య చేసి ఉంటారా? అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో నలుగురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్య

చెరువులో దూకిన ఇంటర్ విద్యార్థి


సాయికుమార్(ఫైల్)

బీబీనగర్, ఆగస్టు 3: జులాయిగా తిరుగుతున్న కుమారుడిని తల్లిదండ్రులు మందలించడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో శనివారం వెలుగుచూసింది. ఎస్ఐ రమేష్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్‌లోని జామాఉస్మానియా ప్రాంతానికి చెందిన గుగ్గిల్ల సాయికుమార్(22) కొన్నిరోజులుగా తెలిసిన చోటల్లా అప్పు చేస్తూ జులాయిగా తిరుగుతున్నాడు. జూన్ 31న తల్లిదండ్రులు తీవ్రంగా మందలించారు. దాంతో తీవ్ర మనస్తాపానికి గురైన సాయికుమార్ అదేరోజు రాత్రి 11గంటల సమయంలో ఇంటి నుంచి స్కూటీని తీసుకుని బయటికి వెళ్లిపోయాడు. సాయికుమార్ ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు అన్నిచోట్లా వెతికినప్పటికీ ఆచూకీ తెలియకపోవడంతో అదేరోజు రాత్రి వారసిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేశారు. కాగా, శనివారం ఉదయం బీబీనగర్-జైనపల్లి మార్గంలో చెరువులో యువకుడి మృతదేహం కనిపించడంతో పాటు పక్కన స్కూటీని పార్క్ చేసి ఉండడాన్ని గుర్తించిన స్థానికులు బీబీనగర్ పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక పోలీసులు స్కూటీని స్వాధీనం చేసుకుని మృతదేహాన్ని వెలికి తీసి పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. స్కూటీ నెంబర్ ప్లేట్ ఆధారంగా చిరునామాను గుర్తించి అప్పటికే మిస్సింగ్ కేసు నమోదైన వారసిగూడ పోలీసులకు బీబీనగర్ పోలీసులు సమాచారం అందించగా సాయికుమార్ కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. చెరువులో లభ్యమైన మృతదేహం తమ కుమారుడిదేనని తల్లిదండ్రులు గుర్తించారు. సాయికుమార్ సోదరి సౌందర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భువనగిరిలో ఉరివేసుకుని


భట్టు కార్తీక్(ఫైల్)

భువనగిరి టౌన్, ఆగస్టు 3 : తల్లి మందలించిందని మనస్తాపానికి గురైన ఇంటర్ విద్యార్థి శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరిలో ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ ఎస్ఐ కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం స్థానిక శ్రుతినగర్‌కు చెందిన భట్టు కార్తీక్(16) స్థానిక శ్రీ వైష్ణవి కళాశాలలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల ప్రారంభమైనప్పటి నుంచి సక్రమంగా తరగతులకు వెళ్లడం లేదు.ఆందోళనకు గురైన తల్లి కళాశాలకు ఎందుకు వెళ్లడం లేదంటూ కుమారుడిని మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన కార్తీక్ శనివారం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరివేసుకున్నాడు. కొద్దిసేపటికి తల్లి ఇంటికి వచ్చాక కుమారుడు ఆత్మహత్యకు పాల్పడింది గుర్తించి పోలీసులకు సమాచారం అందించింది. కార్తీక్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లెక్కలు బోధించేది లేదు

● నిరాకరించిన సామాన్యశాస్త్ర ఉపాధ్యాయుడు

● ఉరుమడ్ల జడ్పీహెచ్ఎస్‌లో నిలిచిన గణితం బోధన, డీఈవో విచారణ


ఉరుమడ్లలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడితో మాట్లాడుతున్న డీఈవో భిక్షపతి

చిట్యాలరూరల్, ఆగస్టు 3: సామాన్య శాస్త్రం ఉపాధ్యాయులు గణితం బోధించాలని విద్యాశాఖ ఉత్తర్వులు ఇవ్వడం, బోధించాల్సిన అవసరం లేదని తాజాగా హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్ల జడ్పీ ఉన్నతపాఠశాలలో 6, 7 తరగతులకు గణితం బోధించేదిలేదని ఓ ఉపాధ్యాయుడు మొండికేశాడు. దీంతో డీఈవో భిక్షపతి శనివారం ఈ పాఠశాలలో విచారణ నిర్వహించారు. గత ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభంలో సామాన్యశాస్త్ర ఉపాధ్యాయుడు విద్యార్థులకు గణితం బోధించాలని విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, ఈ విద్యాసంవత్సరం ఆరంభం నుంచి ఆ రెండు తరగతుల పనిభారాన్ని తగ్గించి గణితం, సామాన్యశాస్త్ర ఉపాధ్యాయుడు పనివిభజన ద్వారా బోధించాలని తీర్పునిచ్చింది. 6, 7వ తరగతుల విద్యార్థులకు సామాన్య శాస్త్ర ఉపాధ్యాయుడు గణితం చెప్పాల్సి ఉంది. 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు గణితం ఉపాధ్యాయుడు బోధించాలి. ఉరుమడ్ల ఉన్నతపాఠశాలలో గణితం బోధించని విషయం విద్యార్థులు తల్లిదండ్రులకు చెప్పగా, వారు అమ్మఆదర్శ పాఠశాల చైర్మన్ మర్రి మాధవి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానోపాధ్యాయుడు ఆదేశించినా గణితం బోధించేది లేదని ఆ ఉపాధ్యాయుడు భీష్మించాడు. ఈ విషయాన్ని మాధవి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన కలెక్టర్, డీఈవోకు సమాచారాన్ని చేరవేశారు. దీంతో డీఈవో ఈ పాఠశాలను సందర్శించి సమావేశం నిర్వహించారు. అయితే పని విభజన చేసుకొని చెరో తరగతి బోధించాలని డీఈవో ఆదేశించగా, తాను గణితం బోధించేది లేదని సదరు ఉపాధ్యాయుడు తేల్చి చెప్పాడు. దీనిపై నివేదిక రూపొందించి తనకు పంపాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బోధనం వెంకటరెడ్డిని డీఈవో ఆదేశించారు.

సాగర్‌కు ప్రారంభమైన పర్యాటకుల రాక


ఎర్త్ డ్యాం వద్ద నుంచి జలాశయాన్ని చూస్తున్న పర్యాటకులు

నాగార్జునసాగర్, ఆగస్టు 3 : నాగార్జునసాగర్‌కు వరద పోటెత్తుతుం డటం రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకుల రాక ప్రారంభమైంది. గత ఏడాది సాగర్ జలాశయంలో నీరు లేకపోవడంతో పర్యాకులు నిరాశతో ఉన్నారు. ఈ ఏడాది ముందస్తుగా ఎగువ నుంచి వరద రావడంతో, అలాగే వారాంతం కావడంతో పర్యాటకులు కృష్ణమ్మ అందాలను తిలకించేందుకు సాగర్‌కు వచ్చారు. సాగర్ ప్రధాన డ్యాంపైకి పబ్లిక్‌కు అనుమతి లేకపోవడంతో హిల్‌కాలనీ డౌన్ పార్కు వద్ద ఉన్న ఎర్త్ డ్యాం వద్ద నుంచి పర్యాటకలు జలాశయంలో కృష్ణమ్మ పరవళ్లను తిలకిస్తూ ఆనందంగా గడిపారు.

రెండో రోజూ మార్చురీలోనే అనిత మృతదేహం

నకిరేకల్, ఆగస్టు 3 : నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం నోముల గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న వివాహిత మృతదేహం రెండో రోజు శనివారం మార్చురీలోనే ఉంది. శుక్రవారం తెల్లవారుజామున అనిత ఆత్మహత్యకు పాల్పడగా పోస్టుమార్టం కోసం నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్య కారకుడైన టేకుల రాజేష్ మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని శుక్రవారం నుంచి పెద్దమనుషులు జరుపుతున్న రాజీ చర్చలు కొలిక్కి రాకపోవడంతో మృతదేహం మార్చురీలోనే ఉంది. మృతురాలి కుటుంబం నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయకపోవడం, పెద్ద మనుషుల చర్చలు ఫలించకపోవడంతో మృతదేహం మార్చురీలోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

టీఎస్‌పీఎస్సీ శుక్రవారం రాత్రి విడుదల చేసిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ) ఫలితాల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా అభ్యర్థులు సత్తా చాటారు. వివిధ విభాగాల్లో ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించారు. ఏఈఈ ఉద్యోగం సాధించిన వారిలో ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తున్న వారు కూడా ఉండటం విశేషం.

ఏఈఈ ఫలితాల్లో మెరుపులు

● పంచాయతీ సెక్రటరీగా చేస్తూనే..


వివేక్

శాలిగౌరారం: నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం బాలిశెట్టిగూడెం గ్రామానికి చెందిన బట్ట విక్రమ్ మిషన్ భగీరథ ఏఈఈగా ఎంపికయ్యారు. ప్రస్తుతం గ్రామకార్యదర్శిగా పనిచేస్తున్న విక్రమ్ పదో తరగతికి వరకు ప్రభుత్వ పాఠశాల్లో సాగింది. ఇంటర్ హైదరాబాద్‌లోని నాగోల్ గురుకులంలో, ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజనీరింగ్, బీఈడీ పూర్తి చేశారు. వివేక్ ఏఈఈగా ఎంపికవడంపై తల్లిదండ్రులు బట్ట వెంకన్న, పూలమ్మలు ఆనందం వ్యక్తం చేశారు.


అనుపమ, అజయ్‌రెడ్డి

చండూరు రూరల్ : ఏఈఈలుగా నల్లగొండ జిల్లా చండూరు మండలం నుంచి ఇద్దరు ఎంపికయ్యారు. కోటయ్యగూడెం గ్రామానికి చెందిన గాలెంక అనుపమ, కస్తాల గ్రామానికి చెందిన దోనాల అజయ్‌రెడ్డిలు పంచాయతీరాజ్ విభాగంలో ఏఈఈలుగా ఎంపికయ్యారు. కోటయ్యగూడెం గ్రామానికి చెందిన గాలెంక అనుపమ భర్త గాలెంక శ్రీశైలం గతంలో 2015లో ఏఈఈగా ఎంపిక కాగా ప్రస్తుతం ఆయన అసిస్టెంట్ ఎక్సిక్యూటివ్ ఇంజనీర్‌గా నల్లగొండ ఎల్ఎస్‌బీసీ పానగల్ రిజర్వాయర్ వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. దీంతో ఒకే కుటుంబంలో భార్యాభర్తలు ఇద్దరు ఏఈఈలు ఎంపిక కావడంపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు. అజయ్‌రెడ్డి ప్రస్తుతం గుర్రంపోడ్ మండలం చేపూర్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు.


లిఖితసేన్

నూతనకల్: సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం సోమ్లాతండాకు చెందిన గిరిజన విద్యార్థిని గుగులోతు సాయిలిఖితసేన్ ప్రజారోగ్యం విభాగంలో ఏఈఈగా ఎంపికయ్యారు. ఎస్టీ విభాగంలో 4వ ర్యాంక్ సాధించారు.

● పేదరికం నుంచి ఏఈఈగా..


నాయిని ప్రీతి

నేరేడుచర్ల: రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబంలో పుట్టి చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదివి, ఉన్నత చదువులతో ఆర్అండ్‌బీలో ఉద్యోగం సాధించింది సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం పెంచికల్ దిన్నకు చెందిన నాయిని ప్రీతి. ఆర్థికఇబ్బందులతో ప్రీతి స్థానిక జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి వరకు విద్యనభ్యసించింది. తరువాత హైదరాబాద్‌లో పాలిటెక్నిక్ పూర్తి చేసి, ఆరోరా కళాశాలలో బీటెక్ చేసింది. టీఎస్‌పీఎస్సీ ఫలితాల్లో ప్రీతి రోడ్లు, భవనాల శాఖలో ఏఈఈగా ఎంపికైంది. తల్లిదండ్రులు నాయిని మణెమ్మ, సైదులులు, కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ప్రీతిని అభినందించారు.


ఇందుకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

పాలకవీడు: సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం కోమటికుంట గ్రామానికి చెందిన గాదె ఇందు పంచాయతీరాజ్ శాఖలో ఏఈఈగా ఉద్యోగం సాధించింది. ఇందు కోమటికుంట ప్రాథమికోన్నత పాఠశాలలో, జాన్‌పహాడ్ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో పాఠశాల విద్యను అభ్యసించి, బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ఉద్యోగం సాధించడంపై తల్లిదండ్రులు గ్రామస్థులు అభినందనలు తెలిపి, మిఠాయిలు తినిపించారు.

● తల్లిదండ్రుల కలలను నిజం చేస్తూ


కరుణాకర్

పెన్‌పహాడ్ : కూలీనాలీ పని చేస్తూ తనను చదివించిన తల్లిదండ్రులను కలలను నిజం చేస్తూ సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం భక్తాళాపురం గ్రామానికి చెందిన నెమ్మాది ఎల్లయ్య-లింగమ్మ దంపతుల నాల్గో కుమారుడు నెమ్మాది కరుణాకర్ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగానికి ఎంపికయ్యారు. తల్లిదండ్రులు రోజు వారి కూలీ పనులు చేసుకుంటూ కరుణాకర్‌ను చదివించారు.


తేజస్విని

● పెన్‌పహాడ్ మండలం రంగయ్యగూడెంకు చెందిన తొగరు తేజస్విని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ ఉద్యోగానికి ఎంపికైంది. ఈమె భర్త తొగరు మణిదీప్‌కు రెండేళ్ల క్రితం తిరుపతి ఎయిర్‌పోర్ట్‌లో టెర్మినల్ మేనేజర్‌గా ఉద్యోగం వచ్చింది. ఆనాటి నుంచి తేజస్విని ఇష్టంతో చదివించారు. తేజస్విని ఏఈఈ ఉద్యోగం ఎంపిక కావడంపై వారి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.


పుట్ట మహేష్, మందుల వంశీ

నడిగూడెం: నడిగూడెం మండలానికి చెందిన ఇద్దరు యువకులు పంచాయతీ రాజ్ విభాగంలో ఏఈఈలుగా ఉద్యోగాలు సాధించారు. బృందావనపురం గ్రామానికి చెందిన పుట్ట మహేష్, రామపురం గ్రామానికి చెందిన మందుల వంశీలు ఏఈఈలుగా ఎంపికయ్యారు. వారిని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

● సివిల్ ఇంజనీర్‌గా బస్సు డ్రైవర్ కూతురు


కానుగు నిఖిత

కట్టంగూరు : నిరుపేద కుటుంబంలో పుట్టి కష్టపడి చదివిన ప్రైవేట్ బస్సు డ్రైవర్ కుమార్తె నల్లగొండ జిల్లా కట్టంగూరుకు చెందిన కానుగు నిఖిత సివిల్ ఇంజనీర్ విభాగంలో ఏఈఈగా ఎంపికైంది. ఆమె తండ్రి ప్రైవేట్ బస్సు డ్రైవర్ కానుగు వెంకన్నగా పనిచేస్తున్నారు. నిఖిత ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపిక కావడంపై గ్రామస్తులు, బంధువులు అభినందించారు.


వెంకటేష్

● కట్టంగూరు మండలం అయిటిపాముల గ్రామానికి చెందిన రైతు బిడ్డ కావేటి వెంకటేష్ మిషన్ భగీరథ ఏఈఈగా ఎంపికయ్యారు. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తున్నారు. వెంకటేష్‌ను గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అభినందించారు.


హర్షిణి

నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన అన్నమళ్ల హర్షిణి ఇరిగేషన్ విభాగంలో ఏఈఈగా ఎంపికైంది. ఆమె తల్లిదండ్రులు ధర్మయ్య, స్వరూపారాణి ఇద్దరు కూడా ప్రభుత్వఉపాధ్యాయులు. హర్షిణిని గ్రామస్తులు, బంధువులు అభినందించారు.

పెట్రోల్ బంకులో రూ.50వేలు చోరీ

చిట్యాలరూరల్, ఆగస్టు 3: పెట్రోల్ బంకులోని గదిలో నిద్రిస్తున్న వారి జేబులోని రూ.50వేలను దొంగలు చోరీ చేశారు. ఈఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి పెట్రోల్‌బంకులో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. గుండ్రాంపల్లి శివారులోని పెట్రోల్ బంకులో విధుల్లో ఉన్న అంతటి శివలింగంతో పాటు మరో వ్యక్తి పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి సమయంలో ఒకరు బయట, మరొకరు లోపల గదిలో నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి 2:30 దాటాక ద్విచక్రవాహంపై ముగ్గురు దొంగలు వచ్చి తదిలో నిద్రిస్తున్న శివలింగం జేబులో ఉన్న రూ.50వేల నగదు, సెల్‌ఫోన్‌ను చోరీ చేయబోరారు. ఇంతలో మేల్కొన్న శివసాగర్ దొంగల్లో ఒకడిని పట్టుకునే ప్రయత్నం చేశాడు. అయితే శివసాగర్‌ను అతడు విడిపించుకుని బైక్‌పై మిగతా వారితో పరారయ్యాడు. అనంతరం శివసాగర్ పరిశీలించగా జేబులోని రూ.50 వేల నగతో పాటు సెల్‌ఫోన్ చోరీకి గురైనట్లు గుర్తించి చిట్యాల పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధర్మా తెలిపారు.

తమ్మరలో ఓ ఇంట్లో ..

అనంతగిరి, ఆగస్టు 3 : సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం తమ్మరబండపాలెం గ్రామంలో శనివారం ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కనగాల నవీన్ ఇంట్లో గుర్తుతెలియని దొంగలు ప్రవేశించి బీరువాలోని తులంన్నర లాకెట్‌తో ఉన్న నల్లపూసల గొలుసు, అరకేజీ వెండి పూజాసామాగ్రిని చోరీ చేశారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. జిల్లా కేంద్రం నుంచి క్లూస్ టీంని పిలిపించి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

పోలీసుల అదుపులో నిందితులు?

వలిగొండ, ఆగస్టు 3 : హైదరాబాద్‌లో ఇల్లు కొనేందుకు అంటూ రూ.1.50 కోట్లు అప్పు తీసుకుని పరారైన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని గొల్నేపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, ప్రశాంత్, అనిల్, అన్నదమ్ములు హైదరాబాద్‌లో ఇళ్లు కొనడానికి డబ్బులు అవసరమని పలువురు గ్రామస్తులను నమ్మించి మాయమాటలు చెప్పి భారీగా నగదును అప్పుగా తీసుకున్నారు. జూలై 15న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులు ఉడాయించారు. అన్నదమ్ములు కనబడకపోయే సరికి అప్పు ఇచ్చిన వారికి అనుమానం వచ్చింది. తామంతా మోసపోయామని ఆలస్యంగా గమనించిన బాధితులు కొందరు రూ.1కోటి 50లక్షలు అప్పుగా ఇచ్చినట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈ కేసును పరారీలో ఉన్న నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. నిందితులు అదుపులో ఉన్న విషయమై పోలీసులు స్పష్టత ఇవ్వడం లేదు.

ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి సహకరించాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 3: ప్లాస్టిక్ కవర్ల నిషేధానికి ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద అవగాహన ర్యాలీని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్‌తో కలిసి ప్రారంభించారు. పట్టణంలోని రైతుబజారులో రైతులు, వినియోగదారులకు సేవాభారతి సంస్థ ప్రతినిధులు శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ నగరసేవాప్రముఖ్ సరికొండ ప్రీతంరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే బీఎల్ఆర్ చేపట్టిన 'నేను నా మిర్యాలగూడ' కార్యక్రమానికి మద్దతుగా నిలిచి ప్లాస్టిక్ రహిత మిర్యాలగూడగా తీర్చిదిద్దేందుకు తమ వంతు సహకరిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆర్యసమాజ్ కమిటీ సభ్యులు చెరుపల్లి కరుణాకర్, శ్రీనివాస్, సుధాకర్, వెంకట్‌రెడ్డి, రామ్‌చంద్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో తక్షణమే బీసీ కులగణన చేపట్టాలి

● *బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ*


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్, ఆగస్టు 3: రాష్ట్రంలో తక్షణమే బీసీ కులగణన చేపట్టాలని ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శనివారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. వెంటనే కులగణన ప్రక్రియ చేపట్టాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్, బీసీపీ రాష్ట్ర కార్యదర్శి కె.పర్వతాలు, బీసీ యువజన సంఘం అధ్యక్షుడు మునాస ప్రసన్నకుమార్, నాయకులు మల్లెబోయిన సతీష్‌యాదవ్, చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్, చల్లా కోటేష్‌యాదవ్, వేణుయాదవ్, సదానంద్, శంకర దుర్గ, నాగరాజుగౌడ్, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు 42శాతానికి పెంచాలి

మిర్యాలగూడ అర్బన్: స్థానికసంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. సంఘం పిలుపు మేరకు ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలగాని వెంకటేష్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కులగణనను హేళన చేసే విధంగా ప్రవర్తిస్తుందన్నారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో బీసీలకు అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పల్ల వెంకటయ్య, నక్క నగేష్, వెంకటేశ్వర్లు, సైదులు, రామకృష్ణ, విష్ణు, శ్రీను, రాములు, నాగయ్య, వీరమల్లు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం


నోటికి నల్లరిబ్బన్ ధరించి నిరసన వ్యక్తం చేసిన మాల మహానాడు నేతలు

మునుగోడు, ఆగస్టు 3: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని మాల మహానాడు జాతీయ స్టీరింగ్ కమిటీ సభ్యుడు గోలి సైదులు ఆరోపించారు. మునుగోడు బీఆర్ అంబేడ్కర్ చౌరస్తాలో ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో శనివారం పలువురు నోటికి నల్ల రిబ్బన్ ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 7,8,9 తేదీల్లో మూడు రోజుల పాటు ఢిల్లీలో నిర్వహించే సామాజిక చైతన్య దీక్షల చలో ఢిల్లీ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాలమహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు బాలశివరాజు, మండల అధ్యక్షుడు చలిచీమల యాదగిరి, నాయకులు జంగిలి నాగరాజు, ప్రమోద్‌కుమార్, మురళి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను నిషేధించాలి : ఐద్వా

నల్లగొండరూరల్, ఆగస్టు 3: రాష్ట్రంలో విచ్చలవిడిగా వెలిసిన బెల్ట్‌షాపులను ఎత్తివేయాలని, మాదక ద్రవ్యాలను నిషేధించి మహిళలకు భద్రత కల్పించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవనంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలపై లైంగిక వేధింపులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు. వెంటనే కొత్త రేషన్‌కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. వరద బాధితుల సహాయార్థం ఐద్వా ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. కొండ అనురాధ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి, ఐద్వా నాయకురాళ్లు జిట్టా సరోజ, తుమ్మల పద్మ, నాగమణి, ఉమారాణి, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ పోరాట ఫలితమే వర్గీకరణ

రామగిరి, ఆగస్టు 3: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చేసిన పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ జరిగిందని ప్రజా దళిత సంక్షేమ సమితి రాష్ట్ర చైర్మన్ బీపంగి జగ్జీవన్‌రాం అన్నారు. పట్టణ పరిధిలోని మర్రిగూడలో వర్గీకరణను హర్షిస్తూ శనివారం మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. వర్గీకరణ వల్ల దళితులకు సమన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు చంటి, వెంకట్, ప్రసాద్, ప్రణవ్, వంశీ, ప్రణవ్, ప్రేమ్ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

నల్లగొండటౌన్, ఆగస్టు 3: పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో గల సాయిశ్రీ మెడికల్ హాల్ నందు వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు సిరిపురం ఉపేందర్ తెలిపారు. ప్రముఖ యురాలజీ వైద్యనిపుణుడు డాక్టర్ చంద్ర మోహన్ కొప్పు ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కిడ్నీ, కాలేయ, థైరాయిడ్, ట్యూబెక్టిమా, మూత్ర సంబంధిత వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారు శిబిరంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 8801336000 నెంబర్ సంప్రదించాలని ఆయన కోరారు.

'స్వచ్ఛదనం - పచ్చదనం'లో భాగస్వాములు కావాలి

శాలిగౌరారం, దేవరకొండ, చింతపల్లి, మర్రిగూడ, మిర్యాలగూడ రూరల్, కొండమల్లేపల్లి, ఆగస్టు 3: ప్రభుత్వం ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు చేపట్టనున్న 'స్వచ్ఛదనం పచ్చదనం' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అధికారులు కోరారు. జిల్లాలోని పలు మండలాల్లో శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా సమావేశాల్లో అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పరిశుభ్రత, వనమహోత్సవం, కాల్వలను శుభ్రం చేయడం, కుక్కల బెడదను అరికట్టడం వంటి కార్యక్రమాలను చేపట్టిందన్నారు. గ్రామాల్లో పిచ్చి మొక్కలను తొలగించి దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. అంతేకాకుండా గ్రామాల్లో చెట్లు, ఇంకుడు గుంతలు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై అవ గాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 5వ తేదీన స్వచ్ఛదనం - పచ్చదనం, 6న తాగునీటి, నీటి హార్వెస్టింగ్, 7న డ్రైనేజీ, మురుగు నీటి నిల్వ గుంతలను పూడ్చడం, 8న ఆరోగ్య విషయాలు, వీధి కుక్కల అంశం, 9న పబ్లిక్ ఇనిస్టిట్యూషన్స్, పబ్లిక్ స్థలాల పరిశుభ్రత అంశాలపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

● శాలిగౌరారం మండలంలోని బండమీదిగూడెంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ఎంపీడీవో జ్యోతిలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై సమీక్ష చేశారు. మొక్కలు విరివిగా నాటాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్‌ను, ప్రాథమిక పాఠశాల తనిఖీ


కొండమల్లేపల్లిలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న అధికారులు

చేశారు. ఉపాధి హామీ పనులను పరిశీలించారు.

● దేవరకొండ మండలంలోని మర్రిచెట్టుతండాలో నిర్వహించిన సమావేశంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్, పశువైద్యాధికారి జితేందర్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయాలు కమల, మాజీ వార్డు సభ్యులు బాలు, సక్రియా, ఏఎన్ఎం విజయ, అధికారులు పాల్గొన్నారు.

● చింతపల్లి మండలంలో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి ఎస్.ద్వారక్ తెలిపారు.

● మర్రిగూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అధికారులు తెలిపారు. సమావేశంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు యాసబ్ తదితరులు పాల్గొన్నారు.

● మిర్యాలగూడ మండలంలోని ధీరావత్‌తండా గ్రామపంచాయతీలో నిర్వహించిన సమావేశంలో పంచాయతీ కార్యదర్శి కోల సాయికుమార్ మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లకు, ఆశా వర్కర్లకు శనివారం అవగాహన కల్పించారు. గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని, మొక్కలను నాటాలని, మురుగునీటిని తొలగించాలని, నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేయాలని, పిచ్చిమొక్కలను తొలగించాలని సూచించారు.

● కొండమల్లేపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో ఎంపీడీవో రాం రెడ్డి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. సమావేశంలో ఈవో డాకునాయక్, ఏపీఎం బొడ్డుపల్లి శ్రీనివాస్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తిప్పర్తి రాధ, టీచర్లు, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


శాలిగౌరారంలో కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

● *సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం*

గట్టుప్పల్, కనగల్, ఆగస్టు 3: ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి డిమాండ్ చేశారు. గట్టుప్పల్, కనగల్ మండలాల్లో శనివారం నిర్వహించిన పార్టీ కౌన్సిల్ సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశం, రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం కోసం సీపీఐ నిరంతరం పోరాటాలు చేస్తుందని, ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, బ్యాంకులో పంట రుణం తీసుకున్న ప్రతీ రైతుకు ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని అన్నారు. బడ్జెట్‌లో పేదల సంక్షేమానికి నిధుల కేటాయింపును పూర్తిగా తగ్గించిందని విమర్శించారు. ఫ్లోరైడ్ జిల్లాగా పేరుగాంచిన నల్లగొండకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులను విడుదల చేయాలన్నారు. పెండింగ్ సాగు, తాగు నీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలింగయ్య, బొమ్మరబోయిన లాలు, మండల కార్యదర్శి బీమనపల్లి రమేష్, రాపోలు సత్తయ్య, గడ్డం నవీన్, వర్కల యాదగిరి, టేకుమట్ల లింగస్వామి, గోపయ్య, సుధాకర్‌రెడ్డి, మల్లేపల్లి ఆదిరెడ్డి, పబ్బు వీరస్వామి, మండల కార్యదర్శి సత్యనారాయణ, పాండరి, సురేందర్, కృష్ణయ్య, యాదయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నెల్లికంటి సత్యం

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

దేవరకొండ, ఆగస్టు 3: దేవరకొండ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో లయన్స్‌క్లబ్ ఉచిత వైద్య శిబిరాలతో పాటు మొక్కలు నాటడం, సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని దేవరకొండ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ అన్నారు. శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దేవరకొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా సామగ్రిని పంపిణీచేసి మొక్కలునాటి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. దేవరకొండ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వస్కుల సత్యనారాయణ మాట్లాడుతూ క్రీడాకారులకు లయన్స్ క్లబ్ అండగా ఉంటుందని, తోడ్పాటునందిస్తుందన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి సముద్రాల ప్రభాకర్, కోశాధికారి నిరంజన్, వనం బిక్షమయ్య, చీదేళ్ల వెంకటేశ్వర్లు, నీల బుచ్చయ్య, గోవర్ధన్, గాజుల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దగట్టు తండాలో ఘనంగా సీత్లా పండుగ

పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు 3: గిరిజనులు ప్రతి ఏటా పెద్దపుశాల కార్తెలో నిర్వహించుకునే సీతా భవాని పండుగను మండలంలోని పెద్దగట్టు తండాలో శనివారం గిరిజనులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రజలు, పశుపక్ష్యాదులు ఆరోగ్యంగా ఉండాలని, పాడి పంటలు సంవృద్ధిగా పండాలని, వర్షాలు కురవాలని గిరిజన మహిళలు, యువతులు సీత్లా భవానీకి దూపదీప నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువతీ యువకులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు కుర్చీల వితరణ

శాలిగౌరారం, ఆగస్టు 3: శాలిగౌరారం పోలీస్‌స్టేషన్‌కు చైత్ర ఫౌండేషన్ ఛైర్మన్ యంగలి రామకృష్ణగౌడ్, శాలిగౌరారం సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ గంటా మహేష్ కుర్చీలను ఎస్ఐ సైదులుకు వితరణ చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వండ్లకొండ పరమేష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండపల్లి కొమరయ్యగౌడ్, చామల జయపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ జోగు సైదమ్మ శ్రీనివాస్, మామిడిపల్లి ప్రశాంత్, బొల్లికొండ గణేష్, శ్రీరాందాసు రాజు, వీరస్వామి, శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.

'ప్లాస్టిక్ కవర్లను ఉపయోగించవద్దు'

హాలియా, ఆగస్టు 3: హాలియా మునిసిపాలిటీలోని వ్యాపారస్తులు ప్లాస్టిక్ కవర్లను ఉపయోగించవద్దని మునిసిపల్ కమిషనర్ మున్వర్‌అలీ అన్నారు. శనివారం స్వచ్ఛదనం - పచ్ఛదనం కార్యక్రమంలో భాగంగా మునిసిపాలిటీ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు నిషేధించినట్లు తెలిపారు. వ్యాపారులు ఈ నెల 10వ తేదీ వరకు వారి వద్ద ఉన్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను క్లియర్ చేసుకోవాలని సూచించారు. లేనిచో 11వ తేదీ నుంచి వ్యాపారసంస్థల్లో సోదాలు నిర్వహించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు దొరికిన షాపు యజమానులకు రూ. 10వేల వరకు జరిమానా విధించనున్నట్లు తెలిపారు.

ఘనంగా ఫ్రెండ్‌షిప్ డే

చిట్యాల, ఆగస్టు 3: పట్టణంలోని గ్రీన్‌గ్రోవ్ పాఠశాలలో శనివారం ఫ్రెండ్‌షిప్ డేను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకున్నారు. ఫ్రెండ్‌షిప్ డే ఆకారంలో కూర్చుని అలరించారు. విద్యార్థులు స్నేహభావంతో మెలగాలని పాఠశాల డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి కోరారు.


ఫ్రెండ్‌షిప్ డే ఆకారంలో విద్యార్థులు

దశాబ్దాల కల నేరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి : ఎన్ఎస్‌యూఐ

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 3: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దశాబ్దాల కల నేరవేర్చారని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రూపావత్ హరిప్రసాద్ అన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభోత్సవాలను హర్షిస్తూ విద్యార్థులతో కలిసి శనివారం అమరవీరుల స్థూపం వద్ద సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తున్న యువత కల నెరవేర్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం ఆహ్వానించదగినదన్నారు. యూపీఎస్సీ తరహాలో జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం గొప్ప విషయమని, సాంకేతికతో కూడిన విద్యనందించే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయడం తెలంగాణ యువత చేసుకున్న అదృష్టమన్నారు. కేజీ టు పీజీ విద్యను బలోపేతం చేయడంతో పాటు నిరుద్యోగ సమస్యకు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అమర్ చౌదరి, కోదటి అనిల్, రాజునాయక్, శివ, పవన్, నాగరాజు, సతీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిని ఆపాలి

నకిరేకల్, ఆగస్టు 3: పాలస్తీనా దేశంపై ఇజ్రాయిల్ మార ణహోమం చేస్తున్న దాడులను వెంటనే ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాళ ప్రమీల డిమాండ్ చేశారు. పాలస్తీనాపై జరుగుతున్న మారణహోమానికి వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో శనివారం నకిరేకల్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి, ఐసీజే తీర్మానాలను ఇజ్రాయిల్ ఉల్లంఘిస్తూ అమెరికా మద్దతుతో మారణహోమం సృష్టించడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి వంటెపాక వెంకటేశ్వర్లు, మర్రి వెంకటయ్య, బి.ఇందిర, వంటెపాక కృష్ణ, ఏర్పుల తాజేశ్వర్, లక్ష్మి, ప్రకాష్‌రావు, రవీందర్ పాల్గొన్నారు.

స్కేటింగ్ పోటీల్లో కాంస్యం సాధించిన శతమన్యు

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 3: హైదరాబాద్ నగరంలోని బాచుపల్లిలో అండర్-9 ఐదవ ఇంటర్ స్కూల్ రోలర్ రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో మి ర్యాలగూడకు చెందిన విద్యార్థి సత్తా చాటాడు. పట్టణంలోని ప్రముఖ గైనిక్ డాక్టర్ రమాదేవి, న్యాయవాది వెంకటేశ్వర్లు దంపతులకు చెందిన కుమారుడు శతమన్యు స్థానిక విశ్వభారతి పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. చిన్నతనం నుంచి స్కేటింగ్‌పై శతమన్యు మక్కువ పెంచుకోవడంతో తల్లిదండ్రులు ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నారు. గత ఏడాది జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని పలు బహుమతులు సాధించాడు. కాగా 2024 ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న శతమన్యు తన ప్రతిభను కనబరిచి కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. విద్యార్థి శతమన్యును పాఠశాల సీఈవో రవికుమార్ ప్రత్యేకంగా అభినందించారు.


కాంస్య పతకంతో శతమన్యు

అశ్రునయనాల నడుమ శ్రీహర్ష అంత్యక్రియలు

● *మండలి చైర్మన్ గుత్తా, ఎమ్మెల్సీ కోటిరెడ్డి నివాళి*

నిడమనూరు, ఆగస్టు 3: డీసీసీబీ డైరెక్టర్, నిడమనూరు సింగిల్‌విండో చైర్మన్ విరిగినేని అంజయ్య ఏకైక కుమారుడు శ్రీహర్ష అంత్యక్రియలు అశ్రునయనాల నడుమ శనివారం నిడమనూరు మండల కేంద్రంలో నిర్వహించారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లో గుండెనొప్పి రావడంతో ఒక్కసారిగా కుప్పకూలి శ్రీహర్ష మృతి చెందిన విషయం విదితమే. నియోజకవర్గంలోని వివిధ పార్టీల నాయకులు, ప్రజలు, బంధుమిత్రులు శ్రీహర్ష అంతిమ యాత్రలో అధిక సంఖ్యలో పాల్గొని కన్నీటి నివాళులర్పించారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, నోముల భగత్, నాయకులు సీడీ రవికుమార్, యడవెల్లి రంగశాయిరెడ్డి, చేకూరి హన్మంతరావు, అంకతి వెంకటరమణ, మువ్వా అరుణ్‌కుమార్, అంకతి సత్యం, నూకల వెంకట్‌రెడ్డి, బొల్లం శ్రీనివాస్‌యాదవ్, భిక్షానాయక్, చేకూరి సూరయ్య, మందలపు మురళి, హర్షవర్ధన్, వింజం శ్రీధర్ తదితరులు శ్రీహర్ష మృతదేహానికి నివాళులర్పించి అంజయ్య కుటుంబ సభ్యులను ఓదార్చారు.

తల్లిపాలే పిల్లలకు శ్రీరామరక్ష

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్): తల్లిపాలే బిడ్డకు శ్రీరామ రక్షగా ఉపయోగపడుతాయని ఐసీడీఎస్ సీడీపీవోలు సక్కుబాయి, లావణ్య అన్నారు. తల్లిపాల వారోత్సవంలో భాగంగా శనివారం ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టిన పిల్లకు ఆరు నెలల వరకు తల్లిపాలు పట్టాలని అన్నారు. తల్లి పాలే పిల్లలకు అమృతమని పేర్కొన్నారు. బిడ్డ పుట్టిన గంట లోపల పిల్లలకు ముర్రుపాలు పట్టించాలని సూచించారు.

● చింతపల్లి మండల కేంద్రంలోని సాయిబాబానగర్, గొడకొండ్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీవో సక్కుబాయి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుగుణ, టీచర్లు అంజలి, పద్మావతి, వసీమాబేగం, సల్మాబేగం, లీలావతి పాల్గొన్నారు.

● చండూరులో మండలంలోని పుల్లెంల, కొండాపురం, పడమటితాళ్ల తదితర గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో లావణ్య మాట్లాడుతూ పిల్లలకు ముర్రుపాలు పట్టించాలని అన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీవో వెంకటమ్మ, సూపర్‌వైజర్లు సుజాత, యాదమ్మ, అంగన్‌వాడీ టీచర్లు సునీత, మౌనిక, ఏఎన్ఎం లక్ష్మి, ఆశా భవాని, ఆయా నర్సమ్మ, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.


చింతపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో సక్కుబాయి

● చిట్యాలలో నిర్వహించిన సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రోజా మాట్లాడుతూ తల్లిపాలలో ఎంతో రోగ నిరోధక శక్తి ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సరళ, అంగన్‌వాడీ సిబ్బంది దాడి అరుణ, అపర్ణ, జ్యోతి పాల్గొన్నారు.

● పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అక్కంపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత, జీపీ సెక్రటరీ రాజశేఖర్, సంఘబంధ అధ్యక్షురాలు మనోహరి, సదానందం, ఏఎన్ఎం అన్నపూర్ణ పాల్గొన్నారు.

స.హ.చట్టాన్ని పకడ్బందీగా అమలుచేయాలి

నల్లగొండ క్రైం, జూలై 3: సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించే విధంగా ప్రభుత్వాలు దృష్టి సారించాలని సమాచార హక్కు ప్రజా వేగుల న్యాయ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కన్నెకంటి క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. సహ చట్టం లక్ష్యాలు, ఆశయాల సాధన కోసం పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో చేస్తున్న దీక్ష శనివారం మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టాన్ని అమలు, ఆచరణ, బలోపేతం కోసం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు సంబంధించి ఏళ్ల తరబడి సహ చట్టంలో పనిచేస్తున్న వారిని గుర్తించి జిల్లా, జోనల్ కమిషనర్ నియామకానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. వారి అనుభవాన్ని చూడాలన్నారు. దీక్షలో ఆర్‌టీఐ యాక్టివిస్టులు బొడ్డు బాబురావు, గాడె ఎల్లేష్, లోడంగి నాగరాజు, మహేష్, కన్నెకంటి సత్యం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

మిర్యాలగూడ అర్బన్: జీవనశైలి, ఆహారపు అలవాట్ల మార్పుతో బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి అనుసంక్రమిత వ్యాధులు విస్తరిస్తున్నాయని ప్రముఖ సీనియర్ డాక్టర్ జాడి రాజు అన్నారు. పట్టణంలోని లయన్స్ ఐ ఆస్పత్రిలో శనివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు పాటించాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్యానికి అవసరమయ్యే వ్యాయామం, వయసును బట్టి తీసుకోవాల్సిన ఆహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

చందంపేట: చందంపేట మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన బాధితుల కుటుంబ సభ్యులను శనివారం ఎమ్మెల్యే బాలునాయక్ పరామర్శించారు. మండల కేంద్రంలోని కస్నె ఎల్లమ్మ, కొండ్రపల్లి సైదులు, కోమల్ల అనిల్, వరికుప్పల మల్లమ్మ ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు బద్యానాయక్, పీఏసీఎస్ చైర్మన్ జాల నర్సింహరెడ్డి, గోసుల అనంతగిరి, మమ్ము, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

నార్కట్‌పల్లి: బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శిగా నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు గ్రామానికి చెందిన రాపోలు గాయత్రి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొండేటి సరిత ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కాశమ్మ గాయత్రికి నియామక ఉత్తర్వులు ఇచ్చారు.

కట్టంగూరు: మండలంలోని కలిమెర గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నల్లగొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నల్లగొండ స్నేహ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బూట్లు, సాక్సులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ఎర్ర అనిత, మామిడి పద్మ, సరళ, దీపిక, స్నేహలతో పాటు ఎంఈవో మేక నాగయ్య, ఎంఎన్‌వో అంబటి అంజయ్య, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు భద్రి నారాయణ, నర్ర సరళ, మాజీ ఉపసర్పంచ్ వెంకటాచారి, సీఆర్‌పీ రమేష్, ప్రసన్నరాణి, లక్ష్మయ్య, హనుమంత్, రవి పాల్గొన్నారు.

చింతపల్లి: సమాజంలోని ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠనం చేయడం ద్వారా జీవితంలో భక్తిభావం పెంపొందే అవకాశం ఉందని ప్రముఖ ఇస్కాన్ గురువువిష్ణునందన్ స్వామిజీ అన్నారు. చింతపల్లి మండలం గొడకొండ్ల గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వైద్యుల రవీంద్రనాథ్‌శర్మ, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రాజశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన పాండరయ్య సూర్యాపేట జిల్లా నెమ్మికల్లు జూనియర్ కళాశాలకు బదిలీపై వెళ్లారు.

తిరుమలగిరి(సాగర్): మండల నూతన ఎస్ఐగా శ్రీనునాయక్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు కాంగ్రెస్ నాయకులు కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎస్ఐ శ్రీనునాయక్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రత పరిరక్షణ కోసం సహకరించాలని అన్నారు.

మిర్యాలగూడ టౌన్: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా మాజీ అధ్యక్షుడు తెడ్ల జవహర్‌బాబు కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు కోసం ఆమరణ నిరాహారదీక్ష చేపట్టి ఆత్మబలిదానం చేసిన పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలుస్తాడన్నారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి గ్రామపంచాయతీ ఈవోగా డాకునాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈవోగా పని చేసిన వీరబాబు కనగల్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో పెద్దవూర నుంచి డాకునాయక్ బదిలీపై కొండమల్లేపల్లికి వచ్చారు.

కొండమల్లేపల్లి: ప్రథమ చికిత్స కేంద్రాలను అర్థరాత్రి వరకు తెరిచి ఉంచాలని రజక సంఘం నాయకుడు భూతరాజు దాసు కోరారు. నిత్యం రద్దీగా ఉండే కొండమల్లేపల్లి పట్టణంలో ప్రమాదాలు జరిగినా అత్యవసర సమయాల్లో వైద్యం కోసం దేవరకొండకు వెళ్లాల్సి వస్తుందని అన్నారు.

రామగిరి: రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పారేపల్లి నాగరాజు, వైద్య సత్యనారాయణ ఆధ్వర్యంలో మంత్రి కోమటిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. గోదాం పాయింట్లలో వేబ్రిడ్జిల నిర్మాణాలు, క్వింటాల్‌కు 1300 గ్రాముల ఖాళీ బస్తా బరువు బియ్యం ఇప్పించాలని, కమీషన్ వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో డీలర్లు దొగుపర్తి సత్యనారాయణ, మసూద్ కలీం, బొల్లా వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దామరచర్ల: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు ముందుకు వచ్చి తమవంతుగా సహాయ, సహకారాలు అందించడం అభినందనీయమని ఎంఈవో బాలాజీనాయక్ అన్నారు. మండలంలోని కల్లేపల్లి జడ్పీ హైస్కూల్‌కు దాత డాక్టర్ ధీరావత్ హరి రూ.10వేల విలువైన ఆట వస్తువులను బహూకరించారు.

దామరచర్ల: ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలంగా ఇచ్చిన తీర్పు మాలలకు అన్యాయం జరిగేలా ఉందని మాలమహానాడు జిల్లా నాయకుడు బైరం నర్సయ్య అన్నారు. రిజర్వేషన్లలో వర్గీకరణ తిరిగి సూక్ష్మ వర్గీకరణకు దారి తీస్తుందని తద్వారా రిజర్వేషన్లకు భంగం కలిగే ప్రమాదం ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణపై న్యాయ పోరాటం చేస్తామన్నారు.

మర్రిగూడ: మండలకేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని బీజేవైఎం జిల్లా, మండల మండల అధ్యక్షులు వంగూరి రాఖీ, నాంపల్లి సతీష్ డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు జూనియర్ కళాశాలు ఉన్న మండల కేంద్రానికి డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని అన్నారు. కళాశాల ఏర్పాటు చేసే వరకు దీక్షలు చేస్తామన్నారు.

చిట్యాలరూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఆసుపత్రులకు వచ్చే ప్రజలకందించే వైద్యసేవలను వైద్యులు, సిబ్బంది మెరుగుపరచుకోవాలని నల్లగొండ డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వెలిమినేడు పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవల గురించి, కాన్పుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు.